నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రామంతాపూర్: విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని చర్చి కాలనీ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఇందిరానగర్, నెహ్రూనగర్, ప్రగతినగర్‌లలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ లావణ్య తెలిపారు.

ఉప్పల్: హబ్సిగూడ ఎన్‌జీఆర్‌ఐ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు కాకతీయనగర్ వీధి నంబర్–3 నుంచి 7 వరకు, హబ్సిగూడ మెయిన్ రోడ్డు, ఎన్‌జీఆర్‌ఐ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ గణేష్ చెప్పారు.

ముందస్తు జన్మాష్టమి వేడుకలు



ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో ప్రైవేట్ స్కూళ్లలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు పండుగ రాక ముందే ప్రారంభించారు. హబ్సిగూడలోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. రాధాకృష్ణులుగా పాడాల మథాన్ష్, మిహికలు వేడుకల్లో పాల్గొని ఆకట్టుకున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

ఉప్పల్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చిలుకానగర్ డివిజన్ రాఘవేంద్ర కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసే సుగుణమ్మ అనారోగ్యానికి గురైంది. దీంతో ఆసుపత్రిలో చికిత్సకు భారీగా ఖర్చు అవుతుందని తెలుసుకున్న కార్పొరేటర్ గీత ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన సీఎం రిలీఫ్ ఫండ్‌కు సిఫార్సు చేశారు. మంజూరైన చెక్కును కార్పొరేటర్ బాధితురాలికి అందజేశారు.

పేదల పాలిట వరం..

కుషాయిగూడ: సీఎం రిలీఫ్‌ఫండ్ పేదల పాలిట వరమని, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. బుధవారం చర్లపల్లి డివిజన్ చక్రిపురం కాలనీకి చెందిన అనిత కుమారుడు సాయినూమోనియతో బాధపడుతూ.. ఆసుపత్రిలో చికిత్స పొందాడు. సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా.. కార్పొరేటర్ శ్రీదేవి చొరవ తీసుకుని మంజూరైన రూ.72,000 చెక్కును బుధవారం బాలుడి తల్లికి అందజేశారు.

సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

రామంతాపూర్: నెహ్రూనగర్‌లోని బద్ది పోచమ్మ ఆలయ ప్రాంగణంలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు ప్రధాన అర్చకులు వేదాంతం సాయికిరణ్ తదితరులున్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు

మల్కాజిగిరి: వేంకటేశ్వరనగర్‌లోని రాఘవేంద్ర స్వామి మఠంలో స్వామివారి 354వ ఆరాధనోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరిరోజు బృందావనానికి పంచామృతాభిషేకం, అలంకారం, కనకమహాపూజ, రథోత్సవం, సుజ్ఞానేంద్రుల ఆరాధనతో ఉత్సవాలు ముగిశాయి.

జాతీయ జెండాల పంపిణీ



శివపురికాలనీలో జెండాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి డివిజన్‌లో కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ.. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్క కుటుంబం ఇంటిపై జెండా ఎగురవేసి నిర్వహించుకోవాలన్నారు. పిల్లలకు ఇప్పటి నుంచే దేశభక్తి గురించి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్

కుషాయిగూడ: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చర్లపల్లి డివిజన్‌కు చెందిన బీజేపీ నేతలు బుధవారం పెద్ద చర్లపల్లిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్‌స్టాప్ పరిసరాలు, సుభాష్‌చంద్రబోస్ విగ్రహం ఆవరణలోని చెత్త,చెదారం ఎత్తేసి శుభ్రం చేశారు. సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ స్వచ్ఛభారత్ ఇన్‌చార్జి వంశరాజ్‌శంకర్, నాయకులు నర్సింగరావు, నాదం, నాగమణి, ఇస్లావత్ హరినాయక్, రామకృష్ణగౌడ్, రాంబాబు, ఏజాజ్, రాజు, రాజేష్, కిషన్, బిక్షపతి తదితరులున్నారు.

వైరల్ ఫీవర్లతో జాగ్రత్త !

బస్తీ, పట్టణ దవాఖానాలకు పెరుగుతున్న రద్దీ | అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

రామంతాపూర్ : హబ్సిగూడ, రామంతాపూర్ డివిజన్ల పరిధిలోని రాంరెడ్డినగర్, వివేక్‌నగర్, శారదానగర్ బస్తీ దవాఖానాలతో పాటు వెంకట్‌రెడ్డినగర్‌లోని పట్టణ ఆరోగ్యకేంద్రం ఆసుపత్రిలో వైరల్ జ్వరాలతో చికిత్స కోసం వస్తున్న రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. సాధారణ రోజుల్లో ప్రతిరోజు బస్తీ దవాఖానాకు 30మంది చొప్పున పట్టణ ఆరోగ్య కేంద్రానికి 60 మంది వరకు వైద్య సేవల కోసం వస్తుండగా.. ఎడతెరిపి లేకుండా గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రద్దీ పెరిగినట్లు సమాచారం.



ప్రభుత్వ పట్టణ ఆసుపత్రిలో రోగుల తాకిడి

వైరల్ జ్వరాలతోనే అధికం..

ప్రతి బస్తీ దవాఖానాకు 50, పట్టణ ఆరోగ్య కేంద్రానికి 100 మంది వరకు రోగుల తాకిడి పెరిగిందని, ముఖ్యంగా వైరల్ జ్వరాలు వంటి నొప్పులు, జలుబు, దగ్గు వంటి బాధలతో వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.

అపరిశుభ్రతతో అవస్థలు..

కొన్ని బస్తీల్లో ఇంకా ఓపెన్ నాలాలు ప్రవహించడం , వర్షం వచ్చినప్పుడల్లా వరద బస్తీల్లోని రోడ్లపై నిలిచిపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు విజృంభించి జ్వరాలు వస్తున్నాయని స్థానిక సంక్షేమసంఘం ప్రతినిధులు వాపోతున్నారు.

తప్పనిసరిగా ఫాగింగ్ చేయాలి..

బస్తీలు, ఓపెన్ నాలాలతో పాటు భూగర్భ డ్రైనేజీలను శుభ్రం చేస్తూ.. బురదను వెంటనే తీసుకెళ్లేలా ప్రతిరోజు దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలంటూ.. సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.

వ్యక్తిగత శుభ్రతను పాటించాలి

వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో వరద నీరు నిల్చి ఉండటం వల్ల దోమలు విజృంభించడంతో వైరల్ జ్వరాలు రావడానికి అవకాశం ఉంది. నల్లాల ద్వారా వచ్చే తాగునీటిని వేడి చేసి చల్లార్చి వడకట్టుకుని తాగాలి. భోజనం చేసే ముందు చేతులను సబ్బు, లిక్విడ్‌తో శుభ్రం చేసుకోవాలి. వ్యక్తిగత శుభ్రతను తప్పనిసరిగా పాటించాలి.

– డా.అభినవ్య, పట్టణ ఆరోగ్య కేంద్రం, వెంకటొరెడ్డినగర్

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి తదితరులు

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలోని సీఐఏ ఆడిటోరియంలో చర్లపల్లి ఇండస్ట్రీయల్ అసోసియేషన్, ఐలా ఆధ్వర్యంలో బుధవారం సీఐఏ ఆడిటోరియంలో నిర్వహించిన మల్టీ స్పెషాలిటీ మెగా హెల్త్‌క్యాంపునకు విశేష స్పందన లభించింది. సుమారు 2 వేల మంది కార్మికులు వైద్య శిబిరంలో పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీదేవి ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. చర్లపల్లి పారిశ్రామికవాడ ప్రగతికి తమ తోడ్పాటును అందిస్తామన్నారు. కార్మికుల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డెన్‌జూబ్లీ, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సహకారం అందజేశారు. ఈ సందర్భంగా జీనియా, ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, రెనోవా డీడీహెచ్ ఆసుపత్రి, ఎంఎస్.రెడ్డి లయన్ కంటి ఆసుపత్రులకు చెందిన వైద్యులు వైద్య సాయం అందజేశారు. సీఐఏ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఐలా అధ్యక్షుడు గోవిందరెడ్డి, ఐలా మాజీ అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి, సురేష్‌కుమార్, పీఎస్. మోహన్, రాఘవయ్య, గంగాధర్‌బాబు, సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

72 గంటల పాటు అధికారులు అప్రమత్తం

- పీర్జాదిగూడ నగరపాలక సంస్థ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు
- కలెక్టర్ ఆదేశాలతో కమిషనర్ అత్యవసర సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ త్రిలేశ్వర్‌రావు

మేడిపల్లి: నగరంలో రానున్న 72 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా ఉండేందుకు బుధవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అన్ని ప్రభుత్వశాఖలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా తీసుకోవాల్సిన చర్యలు, పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీ సమస్యలు, నీరు నిల్వకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ట్రాఫిక్, ఎలక్ట్రిసిటీ నిర్వహణ, రోడ్లపై గుంతలు పూడ్చడం, తాగునీటి సమస్యలపై అధిదికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. 24గంటలు 3 షిఫ్టులుగా అధికారులు, సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. తహసీల్దార్ హసీనా, ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ రమేష్, రోడ్లు భవనాలశాఖ నేషనల్ హైవే డిప్యూటీ ఈఈ సరిత, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి, విద్యుత్ ఏఈలు ప్రదీప్‌కుమార్, హరినాథ్, సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ డీఈఈ సాయినాథ్‌గౌడ్, మేనేజర్లు క్రాంతికుమార్, కిషోర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

అత్యవసర సేవలకు కంట్రోల్ రూం :
900113667,18004257577
హైడ్రా కంట్రోల్ రూం : 9000113667.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

అల్వాల్: వెంకటాపురం డివిజన్ కానాజీగూడ ప్రధాన రహదారిలో నిర్మించే కల్వర్టు పనులను బుధవారం కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్ అధికారులతో కలిసి పరిశీలించారు. కల్వర్టు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ సూచించారు. ఏఈ అరుణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు, బీఆర్‌ఎస్ నేతలు వీరేష్, ప్రభాకర్, మోసిన్, శ్రీనివాస్, శంకర్, జనార్ధన్, నర్సింగ్, జాంధర్ తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు !

వర్షానికి చెరువును తలపిస్తున్న గుంతలు



టెంపుల్ అల్వాల్‌లో వాగును తలపిస్తున్న రోడ్డు

అల్వాల్: రహదారి మరమ్మత్తుల పేరుతో నెలల క్రితం టెంపుల్ అల్వాల్‌లో తవ్విన రోడ్డు పూడ్చకపోవడంతో వర్షాకాలం వస్తే గుంతలుగా మారి వరద నీరు నిల్వ ఉంటోంది. చిన్న చెరువుల్లా మారిన ఈ గుంతలు వాహనదారులు, పాదచారులకు ప్రమాదకరంగా మారాయి. స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరద నీటితో కలిసిన నీరు దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేదంటే పెద్దఎత్తున నిరసన చేపడుతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇదే రహదారిలో సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, బాలాజీ వేంకటేశ్వర ఆలయం, పాండురంగ ఆలయం లాంటి ప్రధాన ఆలయాలకు వెళ్లే రహదారి కావడంతో రోజూ వేలాదిమంది ఇబ్బంది పడుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మౌలాలి: సైబర్ నేరాలపై ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. నేరేడ్‌మెట్ ఎస్‌హెచ్‌ఓ సందీప్ ఆదేశాల మేరకు మౌలాలి డివిజన్ సంతోషీమానగర్ చౌరస్తాలో సైబర్ నేరాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటీపీ, జాబ్‌ఫ్రాడ్, కొరియర్, వీడియోకాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరంలో డబ్బులు పోగొట్టుకుంటే తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేసి ఆయా బ్యాంకు ఖాతాలను బ్లాక్ చేయాలని సూచించారు.

స్థానిక సమస్యలపై అధికారుల పర్యటన

అల్వాల్: కౌకూర్ మహాదేవ్‌పూర్ బస్తీలో జీహెచ్‌ఎంసీ అధికారులు పర్యటించారు. బుధవారం మహాదేవ్‌పూర్ నుంచి హనుమాన్ ఆలయం మెయిన్‌రోడ్డును కలుపుతూ.. ప్రధాన రహదారి గల్లీ రోడ్లు, వర్షాకాలంలో వరదనీరు నిల్వ లేకుండా సరైన స్లాబులు ఉండేలా.. హనుమాన్ ఆలయం వద్ద ఉన్న బాక్స్ డ్రెయిన్‌లోకి చేరేలా బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులు కొలతలు తీసుకున్నారు. డీఈ రఘు, వర్క్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, గ్రామపెద్దలు బాలకృష్ణారెడ్డి, మల్లేష్, వెంకట్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అంజిరెడ్డి, నగేష్, కిరణ్, శివరాజ్, మనీష్, శివ, మల్లికార్జున్‌యాదవ్, కాంగ్రెస్ నేతలు తుడిమెల్ల మల్లికార్జున్ పాల్గొన్నారు.

కనులపండువగా వెంకన్న కల్యాణోత్సవం

మౌలాలి : డివిజన్ తిరుమలనగర్‌లోని అన్నమాచార్య సహిత శ్రీదేవి, గోదా సమేత వెంకన్న స్వామి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. బుధవారం ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మేళతాళాలు, బాజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈనెల 10న అంకురార్పణతో ప్రారంభమైన ఆలయ బ్రహ్మోత్సవాలు 15న నిర్వహించే ధ్వజారోహణ, పుష్పయాగం, ద్వాదశ ఆరాధనతో ముగుస్తాయని నిర్వాహకులు ప్రకటించారు. ఆలయ ప్రతినిధులు హనుమంతరావు, ఆంజనేయులు, ప్రసాద్, సుధాకరరావు, మాధవన్, శ్రీనివాస్, శివానందం, శ్రీదీపిక, లత, అరుణ, హేమలతో పాటు భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

అల్వాల్: టెంపుల్ అల్వాల్ బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీని బుధవారం దేవాదాయశాఖ పరిశీలకులు మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో లెక్కించారు. రూ.5,00,250 ఆదాయం వచ్చినట్లు వారు ప్రకటించారు. ఆలయ ఫౌండర్ రాజాసంజయ్‌గోపాల్ సైంచర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి మఠం వీరేశం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరా సమస్యను పరిష్కరించాలి

మల్లాపూర్: తాగునీటి సరఫరాలో కలుషిత నీరు కలుస్తోందని దుర్గానగర్, బాబానగర్ మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఈ సమస్యను పరిష్కరించాలని జలమండలి ఏఈ సిరాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో పలుమార్లు డీజీఎం, ఏఈ, కార్పొరేటర్, కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని వాపోయారు. సర్వేష్, నర్సింగ్, వెంకటేష్, సాయిల్లు, స్వామి, అండాలు, లింగమ్మ, ప్రమీలా తదితరులున్నారు.

గురుకులాల సమస్యలపై సీఎం దృష్టి సారించాలి

మల్లాపూర్: గురుకులాల్లో నెలకొన్న నిత్యవసర సరుకుల రవాణా విషయంలో తలెత్తిన సమస్యల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని నల్లా రాధాకృష్ణ విజ్ఞప్తి చేశారు. బుధవారం నాచారంలో ఆయన మాట్లాడుతూ.. కొత్త టెండర్ పాలసీకి వ్యతిరేకంగా పాత సరకుల సప్‌లైదారులు సమ్మె కారణంగా గురుకుల విద్యార్థులు పస్తులుండే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత టెండర్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ కన్వీనర్ కనుకుంట్ల విజయ్‌కుమార్, గద్ద యుగేంధర్, వెంకటేశ్వర్లు, సోను, అమరేందర్‌రావు, వెంకటేష్, అశోక్‌బాబు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కాప్రా: మరో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నట్లు వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నగరంలోని ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. ముఖ్యంగా వరద ప్రభావిత, లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్లపై నీరు నిలిచిన చోటుకి వారిని వెళ్లనీయకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు విధులకెళ్లేటప్పుడు రోడ్ల పరిస్థితిని తెలుసుకుని, జలమయమైన రోడ్లపై వాహనాలు నెమ్మదిగా నడపాలన్నారు.

ఎప్పటికప్పుడు అప్రమత్తం..

అధికారులు కూడా ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ.. అత్యవసర సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని, వర్షాలు, వరదలతో ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల భద్రతే తమకు ముఖ్యమని, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే సూచనలు చేశారు.

విద్యుత్ అధికారులతో కమిషనర్ సమీక్ష..

బోడుప్పల్: గత 4 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. బోడుప్పల్ నగర పాలకసంస్థ కార్యాలయంలో బుధవారం పోలీస్, మండల రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి వర్షాలపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరో మూడ్రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నాయని, ప్రజలను అప్రమత్తం చేసి ఎలాంటి ప్రమాదం జరగకుండా చూద్దామన్నారు. అనంతరం మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానికంగా ఎలాంటి సమస్య ఉన్నా.. ముందుగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వార్డు ఆఫీసర్లు కూడా అప్రమత్తంగా ఉండాలని, వేలాడుతున్న వైర్లు, విద్యుత్ స్తంభాల పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అత్యవసరమైతే 040-27215959. మేడిపల్లి మండల తహసీల్దార్ హసీనా, అసిస్టెంట్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌రావు, డీఈ చిరంజీవులు, మెడికల్ ఆఫీసర్ ప్రణీత, ఇరిగేషన్ ఏఈ పరమేష్, ఏఈ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కమిషనర్ శైలజ

పర్యావరణ పరిరక్షణకు కృషి



ఏఎస్‌రావునగర్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని పద్మశాలి టౌన్‌షిప్‌లో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషారెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న కాలుష్య నివారణకు మొక్కలు పెంచడం ఒక్కటే పరిష్కారమని చెప్పారు. ప్రతి ఒక్కపరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, స్థానిక నేతలు కాసం మహిపాల్‌రెడ్డి, కుమారస్వామి, బేతాళ బాలరాజు, మణెమ్మ, మురళి పంతులు, యాకయ్య స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి పరిశీలన



ఉప్పల్: వరంగల్ ఉప్పల్ జాతీయ రహదారిని ఆర్ అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్స్, మేయింటనెన్స్ అధికారులు పరిశీలించారు. దారిపొడవున ఉన్న సమస్యలు, మ్యాన్‌హోల్స్, నాలాలు, తాగునీటి పైపులైన్లు తదితర అంశాలను పరిశీలించారు. ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి ఉప్పల్ నల్ల చెరువు పీర్జాదిగూడ కమాన్ వరకు ఇరువైపుల గల జాతీయ రహదారిని జీహెచ్‌ఎంసీ ప్రాజెక్టు విభాగం డీఈ రవీందర్, ఏఈ పరమేశ్వర్, ఆర్‌అండ్‌బీ డీఈ సరిత, ఏఈ హేమశ్రీ, ఉప్పల్ జీహెచ్‌ఎంసీ మెయింటనెన్స్ విభాగం ఈఈ హరిలాల్, ఏఈ రాజ్‌కుమార్ తదితరులు పరిశీలించారు. అనంతరం రొడ్డుకు ఇరువైపులా 150 ఫీట్ల రోడ్డును మార్క్‌చేసి పనులను ప్రారంభించనున్నారు.

సీపీఐ మహాసభలు విజయవంతం చేయాలి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న దామోదర్‌రెడ్డి

కాప్రా: 19 నుంచి 22 వరకు జరిగే సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని, ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ షాపూర్‌నగర్ మహారాజా ఫంక్షన్‌హాల్‌లో జరగబోయే మహాసభలను విజయవంతం చేయాలని బుధవారం ఈసీఐఎల్‌లోని పార్టీ కార్యాలయం వద్ద ప్రచారరథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. భవిష్యత్తులో కమ్యూనిష్టు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, సీపీఐ రాష్ట్ర మహాసభల్లో అనేక తీర్మానాలు చేసి ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని అభిప్రాయపడ్డారు. సీపీఐ, ఏఐవైఎఫ్ నాయకులు ధర్మేంద్ర,సత్యప్రసాద్, నారా నర్సింహ, సాయిలు, కిరణ్, మహేష్, సుదీర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



మల్లాపూర్: నాగలక్ష్మీనగర్ కాలనీ, కంఠమయ్య దేవాలయం రోడ్డులో డ్రైనేజీ లైన్‌ను పునరుద్ధరించాలని బుధవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డికి కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు. అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని కాలనీవాసులకు ఆయన హామీ ఇచ్చారు. చౌదరిపల్లి పర్వతాలు, బాల్‌రాజ్, రామాచారి, తిరుపతి, ముక్తేశ్వర్‌రావు, రామారావు, నిరంజన్, గోపాల్‌రెడ్డి, యాదగిరి, అమృత, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ముంపు కాలనీల సమస్యలు పరిష్కరించాలి



పీర్జాదిగూడ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

మేడిపల్లి: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పీర్జాదిగూడ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు, పలు కాలనీలు జలమయవుతున్నాయని, నగర బీజేపీ అధ్యక్షుడు రాంపల్లి యాదగిరిగౌడ్ నేతృత్వంలో బీజేపీ నేతలు బుధవారం కమిషనర్ త్రిలేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. నగర పరిధిలోని విష్ణుపురికాలనీ, గణేష్‌నగర్, శ్రీరామ, ఆర్టీసీకాలనీ, చెన్నారెడ్డి ఎన్‌క్లేవ్ శ్రీపాద ఎన్‌క్లేవ్, మాభవానీ కాలనీలు చిన్నపాటి వర్షానికే జలమయమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడేళ్ల నుంచి అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా సమస్యలకు పరిష్కారం లభించడంలేదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. నల్ల భాస్కర్‌రెడ్డి, సంతోష్, మాధవీలత, వెంకటేష్‌గౌడ్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్ బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరద కష్టాలు తీరేదెన్నడో ?

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు కాలనీలు కొద్దిపాటి వర్షానికే జలమయమవుతున్నాయి. ఇళ్లలోకి మోకాలి లోతు వరకు వరదనీరు వచ్చి చేరుతోంది. వర్షాకాలంలో దశాబ్దకాలంగా స్థానికులు ఎదుర్కోవడం పరిపాటిగా మారింది. వర్షాలకు వెంకటాద్రినగర్, న్యూ మిర్జాలగూడ, రాజానగర్, రాజ శ్రీనివాసనగర్, చిన్మయిమార్గ్, జ్యోతినగర్, గోపాల్‌నగర్, న్యూ ఓల్డ్ మిర్జాలగూడ, దయానంద్‌నగర్, అన్నపూర్ణ సొసైటీ, రామాంజనేయనగర్ కాలనీల్లో వరద ముంచెత్తుతోంది.

కాలువల్లా రహదారులు...

వర్షం కురిసిందంటే న్యూ మిర్జాలగూడ ప్రాంతంలోని అంతర్గత రహదారులు కాలువల్లా మారడం సాధారణమైంది. వరదనీరు వెళ్లేందుకు అనువుగా లేకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా కాలనీవాసులు వరదనీటిలోనే వెళ్లాల్సి వస్తోంది. రోడ్డు ఎత్తు పెంచి వరదనీరు సాఫీగా వెళ్లేలా నాలాలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వారు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మిర్జాలగూడలో ఇళ్ల మధ్య పేరుకుపోయిన ఇసుక మట్టి